క్లుప్తంగా

పెరిగిన సందర్శకులు

పెనుగంచిప్రోలు : గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢమాసం కావడంతో మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారి దర్శనానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, దేవదాయశాఖ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అమ్మ వారికి ప్రత్యేక పూజలు

కంచికచర్ల : మండలంలోని గొట్టుముక్కల శివారు రిజర్వు ఫారెస్ట్ వద్ద మద్దులమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పాయసం, పొంగళ్లు వండి సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గతంలో అమ్మవారిని దర్శించుకునేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవటంతో అరకొరగా భక్తులు తరలి వెళ్లేవారు. కాని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ సహకారంతో అమ్మవారి ఆలయం వరకు రోడ్డు పనులు చేపట్టడంతో భక్తులు సులువుగా మొక్కులు తీర్చుకుం టున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆ ప్రదేశమంతా శుభ్రం చేసి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు.

నేడు స్పందన

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ శంకరబాబు ఆదివారం పేర్కొన్నారు. స్పందనలో గ్రామా ల్లోని ఏమైనా సమస్యలుంటే ప్రజలు అర్జీలు దఖలు చేయవచ్చని తెలిపారు. వచ్చిన అర్జీలనుప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పుడు ఏం చేసేది కూడా గమనిస్తూనే ఉన్నామని తెలిపారు. సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎస్ఐ పండు దొర పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. వీరులపాడు గ్రామ శివారులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆటోవాలాలు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించాలని సూచించారు. అపరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలకు జరిమానా విధించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడకు చెందిన ఓ కుటుంబంపై విశాఖపట్నం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అదనపు కట్నం వేధింపుల కేసు నమోదైంది. విజయవాడ కృష్ణసాయి హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చలసాని వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు హర్షకు, విశాఖపట్నంనకు చెందిన మహిళతో 2002లో వివాహం జరిగింది. వీరిద్దరికి నిశ్చితార్థం జరిగిన మరుసటి రోజునే హర్ష కోరిక మేరకు కొత్త కారును మహిళ తండ్రి అందజేశారు. వివాహం జరిగిన 15వ రోజు నుంచే మళ్లీ అదనపు కట్నం, లాంఛనాల కోసం మామ చలసాని వెంకటేశ్వరరావుతో పాటు అత్త కృష్ణ పావని, భర్త హర్ష, ఆడపడుచు నర్మద నిత్యం వేధిస్తుండేవారన్నారు. వారు తన తండ్రిని ఫోన్‌లో నిత్యం దూషించడంతో పాటు కొత్త కారును ఇవ్వాలని వేధిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే ఇంట్లో ఉన్న తనపై దాడి చేసి, అసభ్యపదజాలంతో దూషించారంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వస్వామివారి దేవస్థానంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదివారం పరిశీలించారు. యనమలకుదురు దేవస్థానంలో అనేక అభివృద్ధి పనులు దాత సంగా నరసింహారావు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఘాట్ రోడ్డు విస్తరణ, వాహనాల పార్కింగ్‌కు స్థలం, ప్రాకారం విస్తరణ, కోనేరు నిర్మాణం, ఆలయంలో స్వర్ణ తాపడం ఇతర అభివృద్ధి పనులు అడిగి తెలుసుకున్నారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు, దాత సంగా నరసిహారావు, ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు జరుగుతున్న పనుల వివరాలు తెలిపారు.

సేవలే పరమావధిగా..

నందిగామ: ప్రతి సచివాలయ పరిధిలో వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. కేవలం జీతం కోసం కాకుండా సేవా దృక్పథంతో ప్రతి ఇంటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలుస్తున్నారు. పథకాల గురించి వివరిస్తూ ఆ ఫలాలు ప్రజలకు అందేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వలంటీర్ల సేవలను కొనియాడుతున్నారు.

వలంటీర్లకు వందనం



నందిగామలో మంచానికే పరిమితమైన ఓ వ్యక్తికి చర్మకారుల పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పథకాలు అందేలా చూస్తోంది..



మా వలంటీర్ ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రతి ప్రభుత్వ పథకాన్ని మాకు అందేలా చూస్తోంది. మాది మధ్యతరగతి కుటుంబం నేను, నా భర్త, పిల్లలు అందరం పనికి వెళ్తేనే కుటుంబం గడుస్తుంది. ఈ నేపథ్యంలో కొద్ది నెలల క్రితం నా భర్త షుగర్ పక్షవాతంతో మంచానపడ్డాడు. ప్రస్తుతం మ మ్మలని ప్రభుత్వ పథకాలే ఆదుకుంటున్నాయి. ప్రతినెలా వలంటీర్ ఒకటో తేదీ ఉదయాన్నే వచ్చి మంచానికే పరిమితమైన నా భర్తకు చర్మకారుల పింఛన్ అందజేస్తుంది. నాకు చేయూత, నా మొదటి, రెండవ కుమారుల పిల్లలకు ప్రతి ఏటా అమ్మఒడి, నా మూడో కుమారుడికి వాహన మిత్ర, అమ్మ ఒడితోపాటు ఇల్లు కూడా మంజూరయింది. ఇవన్నీ కూడా మా వలంటీర్ చూసుకున్నారు. నన్ను తల్లిలా ఎంతో ఆప్యాయతగా పలకరిస్తూ మాకు ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తోంది.

–కోట రోజానమ్మ, నందిగామ



ఈ ఫోటోలో సేవలందిస్తున్న వలంటీర్ పేరు ఇనపనూరి శృతి. ఈమె ఎంఎస్సీ చదువుతోంది. ప్రస్తుతం నందిగామ పట్టణంలోని ఐదవ సచివాలయ పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తుంది. శృతి పరిధిలో మొత్తం 61 ఇళ్లు ఉన్నాయి. ఆ ఇళ్లలో 254 మంది జనాభా ఉన్నారు. వారిలో 184 మంది ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీరందరికీ శృతి నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తోంది. తాను ఎమ్మెస్సీ చదువుకున్నప్పటికీ వలంటీర్‌గా పనిచేయడం గర్వంగా ఫీల్ అవుతున్నానని చెప్పింది.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



ఆషాఢ సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు, గాయత్రి సంఘం ప్రతినిధులు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో స్థానిక గాయత్రినగర్‌లో శ్రీగాయత్రి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆషాఢ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అలయ అర్చకులు విశేష పూజలు చేశారు. శ్రీగాయత్రి సంఘం ఆధ్వర్యంలో శ్రీగాయత్రి అమ్మవారికి ఆషాఢ సారె, శాకంబరి అలంకరణ, కుంకుమ పూజ తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. శ్రీగాయత్రి అమ్మవారికి ఆషాఢ సారెను ఊరేగింపుగా మహిళలు, గాయత్రి సంఘం ప్రతినిధులు తీసుకువచ్చి సమర్పించారు. కార్యక్రమంలో గాయత్రి సంఘ అధ్యక్షుడు కలవకొను వామన, కన్వీనర్ కొమరగిరి భరద్వాజ్, మహిళా సంఘ అధ్యక్షులు కొడాలి అపర్ణ, కార్యదర్శి మాడపాటి కిషోర్, కోశాధికారి మంగు సాయి చైతన్య శర్మ, సంఘ పెద్దలు కీసర రాంబాబు, పరిటాల శ్రీనివాస్, చింతలపాటి వాసు, సమరసత డివిజన్ కన్వీనర్ మోటమర్రి లక్ష్మి, శ్రీసాయిసెంచరి హైస్కూల్ ప్రిన్సిపాల్ కొమరగిరి సవిత తదతరులు పాల్గొన్నారు.

వత్సవాయిలో..

వత్సవాయి : స్థానిక శ్రీవాసవీ కన్యకపరమేశ్వరీదేవీ సమేత నవ ఉప ఆలయాల్లో ఉన్న అమ్మవార్లకు ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఆషాఢసారెను ఆదివారం సమర్పించారు. గ్రామంలోని శివాలయం నుంచి ప్రత్యేక ఆకర్షణగా కోలాటాలు, డప్పు వాయిద్యాలతో మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవార్లకు సారెను భక్తిశ్రద్ధలతో అందజేశారు. ఆషాఢమాసం సందర్భంగా 600 కేజీల కూరగాయాలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిగాయి. ఇందులో భాగంగా హోమాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిళ్వార్చన, లక్ష మల్లె పూలతో స్వామి వారికి పుష్పార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవ, శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవల అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. దాతలు అన్నవరపు దుర్గాకుమారి, రత్న శ్రీనివాస్, రామ దయాల్ అన్నప్రసాద వితరణకు సహకరించారు. ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు పర్యవేక్షణంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.



శాంతి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ముగిసిన ప్రథమ చికిత్స శిక్షణ తరగతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోగిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడేందుకు అవసరమైన ప్రథమ చికిత్సను నేర్చుకోవాలని ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్ అధినేత, సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కోలా విజయ శేఖర్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండున్నర దశాబ్దాలుగా రాష్ట్రవ్యాప్తంగా యువతకు జెమ్స్ అల్లాయిడ్ హెల్త్ ఇనిస్టిట్యూట్, పారా మెడికల్ కోర్సెస్, కేంద్ర ప్రభుత్వ మైన్స్ డిపార్ట్‌మెంట్ (ధన్‌బాద్) సంస్థల ద్వారా ప్రథమ చికిత్స శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన యువతకు భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్‌లో ఆదివారం సర్టిఫికెట్లను అందచేశారు. తొలుత శిక్షణ పొందిన వారు సీపీఆర్ విధానాన్ని ఎలా చేస్తున్నారో ఆయన పరిశీలించారు. తమ సంస్థల్లో ఫస్ట్ ఎయిడ్ శిక్షణ పొందినవారు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందిస్తున్నారని, అలాగే వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. వాసవీ ఫార్మా మార్కెట్ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ విజయ శేఖర్, నాగేశ్వరరావు

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేడుకగా బోనాల సమర్పణ



నందిగామ: గ్రామ దేవతకు బోనాల సమర్పణ కార్యక్రమం ఆదివారం అత్యంత వేడుకగా జరిగింది. మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ ముత్యాలమ్మకు గ్రామస్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. పిండి వంటలు, పాయసం వంటివి తయారు చేసి వాటిని మేళ తాళాలు, డప్పు, తీన్‌మార్ వాయిద్యాల మోతల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

వీరులపాడు: ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు విజయవాడకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఎర్రుపాలెం నుంచి విజయవాడ వెళ్తుండగా మండలంలోని జగన్నాథపురం గ్రామ సమీపంలోకి వచ్చే సరికి ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గ్రంథాలయానికి కుర్చీల బహూకరణ

నందిగామ: స్థానిక గ్రంథాలయానికి వాసవీ క్లబ్ సిల్వర్ స్టార్ ప్రతినిధులు ఆదివారం ఆరు కుర్చీలను అందజేశారు. గ్రంథాలయానికి వచ్చే వారికోసం ఈ కుర్చీలను అందజేయడం జరిగిందని క్లబ్ ప్రతినిధి మారం అమరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నందిగామ: లయన్స్ క్లబ్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అభినందనీయమని విశ్రాంత న్యాయమూర్తి జి.రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత న్యాయమూర్తి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆపద సమయాల్లో లయన్స్ క్లబ్ ప్రతినిధులు చేసే సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ చిన్న కొండలరావు (చిన్నా), కార్యదర్శిగా లక్ష్మీకాంత్, కోశాధికారిగా ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం విశ్రాంత న్యాయమూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ మృతి



మాదుగుల నాగరత్నమ్మ (ఫైల్)

నందిగామ: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు, నందిగామ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మాదుగుల నాగరత్నమ్మ (68) ఆదివారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమెకు భర్త, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురు కుమారుల్లో ఒక కుమారుడు గతంలోనే మరణించాడు. నాగరత్నమ్మ మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్‌చ ఇతర ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీనాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మూడుసార్లు కౌన్సిలర్‌గా..

నాగరత్నమ్మ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మంచి బలమైన నాయకురాలు. ఆమె మొదట్లో కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. ఆ సమయంలో నందిగామ గ్రామ పంచాయతీ ఏడో వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీలో చేరారు. నందిగామ గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారిన తర్వాత మరో రెండు సార్లు ఏడో వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌గా ఉన్నారు. ప్రతి ఒక్కరితో కలుపుగోలుగా మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన నాగరత్నమ్మ మృతి చెందడంపై పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



నాగరత్నమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్

ప్రభుత్వ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ సంస్థల్లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాల్లో, పదోన్నతుల్లో రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కట్టా రమాదేవి కోరారు. రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రమాదేవి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నిర్ణయాలు తీసుకున్నారు. రమాదేవి మాట్లాడుతూ.. సర్వీసు రూల్స్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు దక్కాల్సిన రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వారీగా విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సర్వీసు రూల్స్ ప్రకారం ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలపై ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అండ్ ఆఫీసర్స్ జేఏసీ తరఫున ఆయా శాఖల అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాస్ నాయక్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్యవర్గ సభ్యులు

రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు వెస్ట్ ఏసీపీ హనుమంతరావు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కొట్లాటలు, గంజాయి విక్రయాలకు దూరంగా ఉండాలని, ప్రజల ప్రశాంత జీవనానికి ఆటంకం కలిగించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వారం స్టేషన్‌కు తప్పనిసరిగా వచ్చి అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించారు. ఆదివారం ఒక్క రోజే ఎటువంటి నేరాలు, గొడవలు చేయకుండా ఉంటే సరిపోతుందని భావించవద్దని, ప్రతి రోజు నిఘా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ హనుమంతరావు

వెలంపల్లిపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాత శివాలయంలో అవినీతి జరిగిందని, ఆ పాలక మండలికి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు సంబంధం ఉందంటూ జనసేన నాయకుడు పోతిన మహేష్ చేసిన ఆరోపణలను భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం(పాత శివాలయం) పూర్వ పాలక మండలి తీవ్రంగా ఖండించింది. వెలంపల్లిపై అవినీతి తప్పుడు ఆరోపణలను మానుకోవాలని హితవు పలికింది. భవానీపురంలోని పాలకమండలి మాజీ చైర్మన్ పదిలం రాజశేఖర్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తమ హయాంలో పాత శివాలయంలో ఎటువంటి అవినీతి జరగలేదన్నారు. పోతిన మహేష్ పూర్తి సమాచారం తెలుసుకొని మాట్లాడాలన్నారు. తమ పదవీ కాలం గతేడాది ఆగస్టుతో ముగిసిందని, తరువాత జరిగిన పరిణామాలకు తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు. పాత ఈఓ హేమలతాదేవిపై దేవాదాయ శాఖ ఒక కమిటీని నియమించిందన్నారు. కమిటీ విచారణ చేపట్టిందన్నారు. సమావేశంలో ఆలయ మాజీ ధర్మకర్తలు బండారి వెంకట్, డీవీ రెడ్డి, వద్దాది అనిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాత శివాలయం పాలక మండలి మాజీ సభ్యులు

గంజాయి కేసులో ఉన్న వారిపై రౌడీషీటు

పెనమలూరు: గంజాయి అక్రమ రవాణా చేసినా, గంజాయి తాగినా రౌడీషీట్లు తెరుస్తామని పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు స్పష్టం చేశారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో 47 మందిపై రౌడీషీట్లు ఉన్నాయన్నారు. వారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలికి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని జీవించాలన్నారు. ప్రవర్తన సక్రమంగా ఉన్న వారిపై రౌడీషీట్లు రద్దు చేస్తామని తెలిపారు. ఇక గంజాయి తాగినా, అక్రమ రవాణా చేసినా వారిపై రౌడీ షీట్లు తెరవడమే కాక కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● ఎంత అందంగా ఉన్నానో..





నున్న సచివాలయం పరిధిలో ఆదివారం ఓ కోతి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సచివాలయానికి ఉన్న కిటికీ అద్దంలో చూసుకుంటూ ఎంత అందంగా ఉన్నానో అంటూ ఫోజులిచ్చింది. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు కొనియాడారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యాన దాత సాయిచరణ్ జ్యూయలర్స్ అధినేత రాజుసింగ్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారు. 193 నెలలుగా నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు వారికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందించటం అభినందనీయమన్నారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, ట్రస్టీ, విజయ్ విద్యాసంస్థల అధినేత తట్టి అర్జునరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సేవాగుణం అలవరుచుకోవాలని సూచించారు. వృద్ధులకు ప్రతి ఆదివారం ఆయుర్వేదం, అల్లోపతీ, హోమియో వైద్యనిపుణులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దాత రాజుసింగ్, ట్రస్టీలు అమరా ఉమామహేశ్వరరావు, ఎస్ఎన్ వరప్రసాద్, కె మధుసూదనరావు, పి.లక్ష్మీనరసింహరావు, ఎన్‌వీయా సతీష్‌కుమార్, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.